
# సింగిల్ పేజీ కథ

# వార్షికోత్సవం

రెయిన్‌బో పబ్లిక్ స్కూల్ ఆవరణ 'ధన్ ధన్'మన్న డ్రమ్ముల చప్పుళ్లతో, చెవులు చిల్లులు పడే ఆర్కెస్ట్రా శబ్దాలతో అదిరిపోతోంది. ఆ సాయంకాలం ఓ ప్రక్కన ఈవెనింగ్ క్లాసులు సాగుతూ ఉన్నా బయట ప్రాంగణంలో స్టీరియోఫోనిక్ రికార్డు ప్లేయర్ స్పీకర్స్‌లో లేటెస్ట్ హిందీ సినిమా డాన్స్ పాట నలుదిక్కులా మారుమోగు




తోంది. ఓ పాతికమంది పిల్లకాయలు, అందులో ఆడపిల్లలూ , మగపిల్లలూ ఉన్నారు. ఆ పాటకి ఆర్కెస్ట్రాకి అనుగుణంగా హుషారుగా గెంతులు వేస్తున్నారు. మధ్యమధ్యలో డాన్స్ మాస్టారు విజిల్ 'టుర్‌టుర్'మని. దాంతో రికార్డులు బంద్. పిల్లలు స్టాప్... మళ్లీ 'టుర్‌టుర్' విజిల్. డాన్సు మొదలు.

''ఏందమ్మాయ్! అంత నీర్సంగా ఉన్నావ్? నడుం యిట్టా విసిరి మరీ ఊపాలి కదా? హుషారుగా చెయ్యాలి తల్లీ!''

''ఏం బాబూ! బిర్యానీ బువ్వ తినలేదా? ఛెంగుఛెంగున ఎగరాలి కదయ్యా. హీరోకి మల్లే... అయ్యో! ఇట్లా అయితే ఎట్లా? మీ యానివర్సరీ చెట్టెక్కేస్తాదీ...కమాన్...

మళ్లీ స్టార్ట్...వన్...టూ...త్రీ...టుర్ర్...''

అంటూ డాన్స్ మాస్టారు విజిల్ ఊదాడు.

''ఛయ్య...ఛయ్య ఛయ్యా ఛయ్యా...'' అంటూ పాట దంచేస్తోంది. ఇటు పిల్లలు, అమ్మాయిలూ, అబ్బాయిలూ చేతులు పట్టుకొని, చెట్టాపట్టాలేసుకొని అచ్చం నిజం సినిమాల్లోలాగే ఆ గ్రూపు డాన్సుల్లాగే హుషారుగా గెంతేస్తున్నారు.

ఆ స్కూలు వార్షికోత్సవానికి సాగుతున్న సన్నాహాలన్న మాటయివి! కల్చరల్ ప్రోగ్రామ్స్ అంటారు. వీటిని వాళ్లు వార్షికోత్సవ వినోద కదంబ కార్యక్రమాలు. లేదా సాంస్కృతిక కార్యక్రమాలు అని పిలవబడే వీటికి నేతిబీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో సంస్కృతీ, సంప్రదాయం, సంస్కారం కూడా అంతే ఉంటాయి.

ఈ రికార్డింగ్ నాట్య కార్యక్రమానికి కనీసం మూడు వారాల రిహార్సల్స్ అయినా ఉంటాయి. దానికో కమిటీ, అందులో వేడివేడి చర్చలూ జరిగాయి. ఎనిమిదో తరగతి సైన్స్‌మిస్‌కి సంగీతంలో డిప్లొమా కూడా ఉంది. కూచిపూడి డాన్సులు పెడదాం. మన డాన్సు టీచరుకి తెలిసినట్టు వాంగం బృందం ఉందిటగా'' అంటూ ఇంగ్లీషు మిస్ సూచించింది.

''కూచిపూడి డాన్స్ అంటే అదేనా? చెంబూ, పళ్లెం పెట్టుకొని, సర్కస్ చేస్తూ ఉంటారు'' అంటూ కరస్పాండెంట్ నవ్వేశాడు.

''గ్రూపు డాన్సులుండాలి...పిల్లకాయలు గోల పెడతారు మళ్లీ- మాకు ఛాన్స్ ఇవ్వలేదంటే మాకివ్వలేదంటూ. అంచేత ఓ ట్వంటీ స్టూడెంట్స్‌కయినా ప్రతీ పాటలో, డాన్స్‌లో చాన్సు ఇవ్వాలి'' అన్నాడాయన.

''ఇది మంచి అయిడియా సార్! ఇప్పుడన్నీ స్కూల్సులోనూ, 'మైరమన్ డోలే మెరె తన్ డోలే', 'రంగ్‌దే రంగ్‌దే ముఝె రంగ్‌దే...ఆ రంగ్‌దే...' పాటలే చేయిస్తున్నారు. 'ఛయ్యా ఛయ్యా' పాట సరేసరి'' అంటూ లెక్కల మిస్ ఉత్సాహంగా హావభావాలను ప్రదర్శిస్తూ మరీ చెప్పుకుపోయింది.

''పేరెంట్స్ కూడా 'గాజువాక పిల్లా గాజులోళ్లమే పిల్లా మేమూ - సబ్బులోళ్లమే పిల్లా' పాటే కావాలంటారండీ...ఇప్పుడు ఏ స్కూల్లో, స్కూళ్లల్లోనే కాదు, కాలేజీల్లో కూడా కల్చరల్ ప్రోగ్రామ్సులో ఇలాంటి పాట 'మస్టు'సార్!'' అంటూ డ్రిల్ మాస్టారు చొక్కా చేతులు మడుచుకుంటూ మరీ చెప్పాడు.

ఇట్లా వాదోపవాదాల తర్వాత సరే. ''ఫండ్స్ ఉన్నాయిగా. పిల్లలొక్కొక్కరి దగ్గరా వందరూపాయలు వసూలు చేయండి చాలు. గాజులోళ్లో పూసలోళ్లో - ఏదో ఒకటి మన వీపులు సాపు అయిపోకుండా చూడాలి'' అంటూ కరస్పాండెంట్ కమ్ ప్రిన్సిపాల్ కమ్ సారుగారు లేచి చక్కాపోయాడు.

ఆయనకి అవతల పార్టీ ఉంది. పైగా అది వెట్ పార్టీ కూడా.

కమిటీ అంతా కలిసి ఒక పాపులర్ హిందీ సాంగ్‌నీ, మరో టాప్ హిట్ తెలుగు పాటనీ ఎంపిక చేసి ఓ డాన్స్ మాస్టర్నీ, దాంతో పాటే పెళ్లిళ్లల్లో మంటపం అదరగొట్టే ఆర్కెస్ట్రా గ్రూపునీ 'బుక్' చేసుకున్నారు. పిల్లల్లో కొంతమంది టీవీ ఛానల్స్‌లో 'డాన్స్ డాన్స్'లాంటి కార్యక్రమాల్లో డాన్సులు చేసిన వాళ్లున్నారు. అంచేత ఇదేమంత ప్రాబ్లమ్ కాదు.

పదవ తరగతిలో ఉన్న సంపత్ ఏ నాట్యం అయినా ఇలా అవలీలగా చేస్తాడు. చేసి చూపించి పిల్లలచేత చేయించగలడు కూడా. అంచేత డాన్స్ లీడర్‌గా సంపత్‌ని పెట్టారు.

''ఛబ్బీ చీక్స్, డింపుల్ చిన్, కర్లీ హెయిర్'' అంటూ కీర్తించబడుతూ ఎర్రగా, అందంగా, చురుకుగా హొయలు, టక్కులు వొలకబోస్తూ కాలేజీ స్టూడెంట్‌లా ఉండే విద్యుల్లతని 'లీడ్ డాన్సర్'గా పెట్టారు. ఆ ఇద్దరికీ టీవీ ఛానల్స్ అనుభవం ఉంది.

అవసరమైన డ్రెస్సులు కొనడానికీ ఈ వార్షికోత్సవంలో తమ పిల్లల మీద పైసలు బాగా ఖర్చు పెట్టడానికి ముందుకు వచ్చిన మమ్మీ, డాడీల

సాయంతో కలర్‌ఫుల్ నాట్యం రిహార్సల్స్ మొదలెట్టారు.

స్కూలు ఆవరణా, స్టేజీ కూడా చాలదని ఫంక్షన్‌కి ప్రతిష్ఠాత్మకమైన 'కళాపీఠం' అడిటోరియం అద్దెకు తీసుకున్నారు.

రానే వచ్చింది ఆ వార్షికోత్సవ శుభదినం. స్టేజీ మీద కళ్లు చెదిరేలా ఎవరు మగపిల్లలో ఎవరాడపిల్లలో తెలీకుండా కలిసిపోయి నాట్యప్రదర్శన సాగించారు.

కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. కొంతమంది ఫొటోగ్రాఫర్లను పేరెంట్స్ ఏర్పాటు చేసుకున్నారు. కొందరు వీడియోలు కూడా తీయించుకున్నారు.

ఈ రికార్డింగుల తర్వాత ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ రానే వచ్చింది. కార్పొరేటు దండు బాబుగారు లెక్చరిచ్చాడు. ఎవరూ వినే మూడ్‌లో లేరు.

సోషల్ మిస్ మైక్‌లో అరిచింది. ''ఫస్ట్ ప్రైజ్ జాయింట్‌గా సంపత్, విద్యుల్లతలకి ఇచ్చాం. వాళ్లు వేదిక మీదికి రావాలి. ప్లీజ్ కమ్ టు ద డయాస్'' అంటూ.

ప్చ్...ప్చ్...ఎవ్వరూ రాలేదు. మళ్లీ అనౌన్స్‌మెంటు చేసింది. పిల్లల్లో కలకలం తారాస్థాయికి చేరుకుంది,

''కమ్ కబ్ బాబీ...హలో బాబీగాల్..లెట్స్‌గో పార్టీ'' అంటూ కేకవేశారు మరికొందరు. ఆకతాయి స్టూడెంట్స్...

వేదిక మీద ఉన్న వారంతా, నల్లగా మొహాలు చేసుకున్నారు. సంపత్, విద్యుల్లతల తల్లిదండ్రుల గుండెల్లో రాయి పడ్డది.

పిల్లలేమయినట్లు? స్కూలు నిర్వాహకులు తెలివిగా పరిస్థితిని కమ్ముకొచ్చారు.

''యువర్ ఎటెన్షన్ ప్లీజ్! పిల్లలు ఛేంజి రూమ్‌లో మేకప్‌లు కడుక్కుంటున్నారు కాబోలు. ఈ లోగా సంపత్ మదర్‌గారూ, విద్యుల్లత మదర్‌గారూ వచ్చి వారి పిల్లల ప్రతిభకి వచ్చిన ఈ బహుమతులను తమ అమృతహస్తాలతో అందుకుంటారు'' అంటూ ఎనౌన్స్ చేసింది సోషల్ మిస్. ఆమె చాలా తెలివైంది.

కానీ కరతాళ ధ్వనులు, హిప్ హిప్ హుర్రేలు ఆ ఇద్దరి పేరెంట్స్ చెవుల్లోనూ పడటం లేదు. వాళ్ల ప్రాణాలు కడబట్టుతున్నాయి.

''దే ఎస్కేప్డ్...ఎస్కేప్డ్ ఏమిటీ? 'ఎలోప్డ్' అనూ'' అంటున్నారెవరో. తలో వ్యాఖ్యానం చేస్తున్నారు.

''అనుకున్నాం. కాస్ట్యూమ్ కిట్స్‌కి తాళాలు వేసి రెండో కంటికి దొరక్కుండా దాచేసుకున్నారు. అప్పుడే అనుకున్నాం'' అన్నారు కొందరు.

''అయినా మనకెందుకు? ప్రిన్సిపాల్‌గారి సి.ఐ.డి.లు మన మాటలు వింటే కొంప మునుగుతుంది'' ఈలోగా కరస్పాండెంట్ గప్‌చిప్‌న పేరెంట్స్‌ని పక్కకి తీసుకుపోయాడు. ''లెటజ్ టాకిల్ దిస్ కేర్‌ఫుల్లీ. నా కారు తీసుకుని మా డ్రిల్లు మాస్టరు వస్తాడు. ఎక్కడికి పోతారు? ఫ్రెండ్స్ ఇళ్లకి పోయుంటారు'' అంటూ సర్దిచెప్పాడు.

''వెళ్లండి...వెతకండి'' డ్రిల్‌మాస్టారే ఈ షోకి రింగ్‌మాస్టర్ కనుక అతన్ని తిట్టసాగారంతా. అతనికో ఐడియా వచ్చింది. ''పదండి సార్ కార్లో'' అంటూ పేరెంట్స్‌ని ఎక్కించుకుని రైల్వే స్టేషన్‌కి దౌడు తీయించాడు.

''ఇప్పుడు హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ ఉందిగా... హైద్రాబాద్...చెక్కేద్దామనుకుంటారు వాళ్లు''

విద్యుల్లతకో టెలిఫోన్ ఫ్రెండున్నాడు. సినీ ఫీల్డులో...అక్కడికే పోవచ్చును. హైద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ పట్టుకొని గాలించేద్దాం... తరువాత... మిగతా ప్రయత్నాలు'' అన్నాడు.

పేరెంట్స్‌కి కరచరణాలు ఆడక, నోట మాట రావడం లేదు.

''వచ్చే ఏడాది వార్షికోత్సవం - కల్చరల్ షో అన్నారంటే ఉద్యోగాలు పీకేస్తాను ఏమనుకుంటున్నారో...'' అంటూ చిందులు వేస్తున్నాడు ప్రిన్సిపాల్.

**-వీరాజీ** (విజయవాడ)

# అసలు విషయం

**వా**రం రోజులు సెలవులో ఉండి ఆ రోజే ఇంటికొచ్చాడు రాజేష్. ఊరు వెళ్లేటప్పుడు ఇంటి తాళాలు ఓనర్స్ ఇంట్లో ఇవ్వడం అలవాటు. వెళ్లి కీస్ తీసుకుని రూం ఓపెన్ చేసి చూసి తెల్లబోయాడు. చివ్వున వెనుతిరిగి ఇంటి ఓనర్ మురళి దగ్గరకెళ్లాడు.

''ఏంటండీ ఇది? మీరు చేసిన పని ఏమన్నా బాగుందా?'' దూకుడుగా అడిగాడు.

''అదేంటయ్యా.. నేనేం చేశాను?'' నివ్వెరపోయాడు మురళి.

''ఏంచేశారా? నేను లేని టైంలో రూంకి సున్నం వేయిస్తారా? నాకు చెప్పాల్సిన అవసరం లేదా?''


''అదేమిటయ్యా అందరూ సున్నాలేయమని అడుగుతారు. నీవేమో వేయించినందుకు సంజాయిషీ అడుగుతున్నావు?'' అయోమయంగా అడిగాడు ఇంటి ఓనర్ మురళి.

''సామానంతా...''

''నేనూ...మా ఆవిడ దగ్గరుండి వేయించాం. ఒక్క పూచిక పుల్ల కూడా పోలేదు. కావలిస్తే చూసుకో'' మధ్యలోనే చెప్పాడు.

''అది కాదండీ..నా ఇంపార్టెంట్ టెలిఫోన్ నెంబర్స్ అన్నీ పాడుచేసేశారు'' ఉక్రోషంగా అన్నాడు రాజేష్.

''అయ్యో... లేదు బాబూ.. చెత్త పేపర్



కూడా దులిపి ఓ కవర్‌లో వేయించాను. టెలిఫోన్ డైరెక్టరీ అస్సలు ముట్టుకోలేదు'' బాధగా చెప్పాడు మురళి.

''అదికాదండీ...నే ఫోను పక్కనే గోడకు ఇంపార్టెంట్ టెలిఫోన్ నెంబర్స్ అన్నీ రాసుకున్నాను. మీరేమో నాకు చెప్పకుండా సున్నం వేసేశారు. ఇప్పుడేం చేయాలి?... నాకా నెంబర్స్ ఎలా దొరుకుతాయి?'' అసలు విషయం చెప్పాడు రాజేష్.

తెల్లబోవడం మురళి వంతైంది.

**-ఊర్మిళా సుభాన్** (మర్ల)